# 15. గోపికా మాన సంరక్షణం!

హిజ్ హైనెస్ మహారాజా రిపుదమన్ సింహాజీవారు జగత్ ప్రసిద్ధ శృంగార పురుషులు. వారు కామించిన కాంతను పొందకుండా ఉండటం అనేది వారి పాలనా కాలంలో ఏనాడూ లేదు. ఈ విషయంలో శ్రీవారు సామ, దాన, భేద, దండోపాయాలకు తోడుగా మరో ఉపాయాన్ని కూడా స్వయంగా కనిపెట్టి, దానిని దిగ్విజయంగా అమలు పరచిన ఘనులు.

శ్రీవారి కన్ను పడటం ఆలశ్యంగా వారి ఏజెంట్లు సదరు యువతి వెంటపడి, రాజాంతఃపురంలోనికి ఆమెను చేరవేసేందుకు చేయగలిగిందంతా చేసి, సఫలులైతే ఘనంగా కానుకలందుకొని ధన్యులయ్యేవారు.

లేకుంటే...?

శ్రీవారే స్వయంగా కార్యరంగంలోకి దిగేవారు.

ఏ పండుగ వచ్చినా వదలకుండా ఆచార ప్రకారం రాజధానీ నగర సమీపంలో గల అటవీ ప్రాంతంలో మహారాజావారు ఘనమైన ఉత్సవాలను ఏర్పాటు చేసేవారు.

ఆచారం ప్రకారం ఈ ఉత్సవాలకు ఎవరికీ ఆహ్వానం అవసరం లేదు. సహజంగా ఆసక్తిగల అన్ని తరగతులవారూ ఆ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొనేవారు. తమకోసం నిర్మింపబడిన అసంఖ్యాకమైన డేరాల్లో చాలామంది రాత్రిళ్ళు కూడా ఉండిపోయి ఆనందించేవారు.

వీటిలో కొన్ని-కొన్ని మరీ అందమైనవి. వాటిలో గల సౌకర్యాలు సుఖకరమైనవి. అయితే ఇలాంటి డేరాలు మామూలు డేరాలకు చాలా దూరంగా అడవిలో అక్కడక్కడా విసిరేసినట్లుగా నెలకొల్పబడి వుండేవి. సామాన్యంగా ఇలాంటి డేరాలలో తమ స్త్రీ జనంతో కలిసి వచ్చినవారు దిగుతూండేవారు, ఏకాంతం కోసమని.

మహారాజా రిపుదమన్ సింహజీవారు తమ కోరికను నిరాకరించిన యువతి తన వారితో కలిసి సరిగ్గా ఈ సుదూరపు డేర్లాలోనే మకాం చేసేలా అనుచరుల సాయంతో మేనేజ్ చేసుకునేవారు.

అప్పుడు, ఆ పండుగనాటి మొదటి రాత్రి, అసలు కథ నాటకీయంగా ఆరంభమయేది.

ఆ యువతి తన కుటుంబీకుల్తో పగలల్లా పండుగ వినోదాల్లో అలసిపోయి సుఖంగా, నిశ్చింతగా నిద్రిస్తూండగా హఠాత్తుగా ఓ బందిపోట్ల ముఠావచ్చి పడేది. గప్‌చిప్‌గా ఆ యువతి తాలూకు వారిని కాళ్ళూ, చేతులూ కట్టి ఓ మూల పారవేసి యువతిని భుజాన్నేసుకుని అడవిలోకి పారిపోయేవారు.

ఆ యువతి తన్నుకునేది. ఏడ్చేది. పదలిపెట్టమని దయనీయంగా ప్రార్థించేది, కానీ వారు పట్టించుకునే వారుకారు.

సరిగదా అడివిలో ఓ మూలనున్న తమ కుటీరానికి తీసుకుపోయి బలత్కారం చేయనారంభించేవారు. ఆవిడ దుస్తులు ఊడదీయటానికీ, చింపటానికీ వారు కర్కశంగా ప్రయత్నించేవారు. ఆ యువతి శోకం అరణ్య రోదనంగా మిగిలి పోయేది.

సరిగ్గా వారా యువతిని బలవంతంగా వివస్త్రను చేసే సమయానికి ఓ దారిన పోయే దానయ్య అకస్మాత్తుగా ఆ కుటీరంలో జొరబడేవాడు.

ఆ అయిదారుగురు బందిపోట్లతోనూ వీరోచితంగా పోరాడి, ఆ మహా శూరుడు వారిని తన్ని తరిమేసేవాడు.

వారలా పారిపోయాక...

ఆ మాన సంరక్షకుడు...

నగ్నంగా, భీతావహయై నేలకూలి ఉన్న సదరు సుందరాంగిని అభయ హస్తంతో లేవదీసి, అక్కున చేర్చుకుని, చెక్కిళ్ళు నిమిరి, ముంగురులు సవరించి, కన్నీరు తుడిచి, కౌగిట బిగించేవాడు. తన పై ఉత్తరీయాన్ని తీసి ఆ యువతిపై కప్పేవాడు.

ఆపద్బాంధవుడిలా, అపర శ్రీకృష్ణ పరమాత్మనిలా ప్రత్యక్షమై, దుండగుల బారినుండి మాన సంరక్షణం చేసిన ఆ అపరచితుని కౌగిట్లో ఆ యువతి ఆ రాత్రి కరిగిపోయేది. కృతజ్ఞతాభావంతో తన్ను తాను సమర్పించుకునేది.

ఆ దానయ్య మరెవరోగాదు.

మామూలు దుస్తుల్లో ఉన్న సాక్షాత్తూ మహారాజా రిపుదమన సింహజీ వారే.

ఆత్మ సమర్పణం చేసుకోవటం పూర్తయ్యాక ఆ యువతికి సదరు దానయ్య మహారాజాగా పరిచయం అయ్యేవాడు.

చేసేదిలేక, మునిగాక ఇంకా చలి ఏమిటని ఆ యువతి నేరుగా రాణీవాసంలో చేరిపోయేది.

ఆ విధంగా అభినవ శ్రీకృష్ణులైన మహారాజా రిపుదమన్ సింహజీ వారు తమ కంటి కెనరుగా కనుపించిన అనేక మందితో అంతఃపురాన్ని నింపివేసేరు.

అయితే, ప్రతిసారీ కూడా ఆ మర్నాడుదయమే శ్రీవారి చేతుల్లో చావు దెబ్బలుతిని పారిపోయిన దుండగులు మహారాజా వారి దర్శనం చేసుకుని యథోచితంగా సువర్ణదానాలు అందుకుంటూండేవారు.

అలా అందుకుని...

మరలా తన్నులు తినేందుకుగాను తయారుతింటుండేవారు.

★